సాక్షి
అనకాపల్లి

గురువారం ι 11 ι మే ι 2023



ఉత్తీర్ణతే లక్ష్యంగా... IIలో

ఇంటర్ ఫెయిలైన విద్యార్థినులకు కేజీబీవీల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు వారిని సిద్ధం చేస్తున్నారు.



ఆటోను ఢీ కొట్టిన వ్యాన్

హైవేపై నక్కపల్లి సారిపల్లిపాలెం మధ్యలో జరిగిన ప్రమాదంలో 12 మందికి గాయాలయ్యాయి. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. IIలో



చిన్నారి బలి IIలో

సరదాగా పిల్లలను స్విమ్మింగ్ పూల్‌కు తీసుకెళ్లిన తల్లిదండ్రులు క్షణాల్లో కుమారుడిని కోల్పోయారు.

అభివృద్ధి పరవళ్లు

- నేడు కీలక ప్రాజెక్టులను ప్రారంభించనున్న సీఎం జగన్
- క్రికెట్ స్టేడియం ఆవరణలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ
- అపోలో క్యాన్సర్ యూనిట్ ప్రారంభం
- సీ హారియర్, స్పోర్ట్స్ ఎరీనా ప్రజలకు అంకితం
- భీమిలి ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు, ఎండాడలో కాపుభవన్‌కు శంకుస్థాపన

దొండపర్తి(విశాఖ) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన అభివృద్ధికి సాక్ష్యంగా నిలవనుంది. పర్యాటక మణిమకుటం సీ హారియర్ మ్యూజియం, క్రీడా వైభవానికి సాక్ష్యంగా నిలవనున్న ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను ఆయన ప్రజలకు అంకితం చేయనున్నారు. మత్స్యకారుల కలల కేంద్రం ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు అంకురార్పణ జరగనుంది. వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియం ప్రాంగణంలో మహానేత వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ, అపోలో ఆస్పత్రిలో క్యాన్సర్ యూనిట్ ప్రారంభం, కాపు సంక్షేమ భవన్‌కు శంకుస్థాపన తదితర కార్యక్రమాలు సీఎం జగన్ చేతులమీదుగా జరగనున్నాయి.



ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా ఆవిష్కరణకు సిద్ధమైన వైఎస్సార్ విగ్రహం

స్టేడియంలో వైఎస్సార్ విగ్రహం

విశాఖ స్పోర్ట్స్: పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియం ప్రవేశద్వారం వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ నిలువెత్తు విగ్రహాన్ని సీఎం జగన్ ఆవిష్కరించనున్నారు. ఈ విగ్రహం నిర్మాణానికి ఏసీఏ అపెక్స్ కౌన్సిల్‌తో పాటు జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. విగ్రహం దూరం నుంచి ఆకట్టుకునే విధంగా రూపొందించారు. ముందుగా అనుకున్న బేస్‌మెంట్‌ను కాస్త పెంచారు. విగ్రహం బరువుకు అనుగుణంగా బేస్‌ను 90 డిగ్రీల నుంచి 45 డిగ్రీల యాంగిల్‌కు మార్చి ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు.

సీఎం పర్యటన ఇలా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 3.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా 3.50కి పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4.50 గంటలకు ఆరిలోవలోని అపోలో ఆస్పత్రికి చేరుకుంటారు. అక్కడ అపోలో క్యాన్సర్ యూనిట్‌ను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఫొటో సెషన్‌లో పాల్గొని.. రేడియేషన్ పరికరాల కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడి నుంచి 5.50 గంటలకు బీచ్‌రోడ్డుకు చేరుకుని రూ.7.5 కోట్లతో నిర్మించిన సీ-హారియర్ మ్యూజియం, ఎంవీపీకాలనీలో రూ.25.5 కోట్లతో నిర్మించిన జీవీఎంసీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా, రామ్‌నగర్‌లో రూ.12 కోట్లతో నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం భీమిలిలో రూ.24.86 కోట్లతో నిర్మించనున్న ఫిష్ ల్యాండింగ్ సెంటర్, ఎండాడలో కాపు భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 6.15 గంటలకు బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కుమారుడి వివాహానికి హాజరవుతారు. సాయంత్రం 7 గంటలకు తిరుగు పయనమై రాత్రి 8.20కి తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

రూ.24.86 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్

భీమిలి తీరగ్రామాల మత్స్యకారుల కల నెరవేరనుంది. ఆరు ఎకరాల విస్తీర్ణంలో రూ.24.86 కోట్ల వ్యయంతో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేయనున్నారు. దీని ద్వారా భీమిలిలో తోటవీధి, బోయవీధి, ఎగువపేట, నాగమయ్యపాలెం, మరికొన్ని ప్రాంతాల మత్స్యకారులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం భీమిలిలో 141 మోటరైజ్డ్ బోట్లు, 109 నాన్‌మోటరైజ్డ్ బోట్లలో మత్స్యకారులు వేట చేస్తున్నారు. ఈ ప్రాంతంలో 1,524 మంది మత్స్యవేటపైనే జీవనం సాగిస్తున్నారు. ప్రతి ఏటా 403.16 మెట్రిక్ టన్నుల మత్స్య సంపద వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఇక్కడ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా 250 బోట్లకు సేఫ్ పార్కింగ్, వేలం హాలు, నెట్ మెండింగ్ సెంటర్, కమ్యూనిటీ హాల్, 2 ఫిష్ డ్రైయింగ్ ప్లాట్‌ఫాంలు, ట్రక్ పార్కింగ్, గ్రామం నుంచి ల్యాండింగ్ సెంటర్ వరకు సిమెంట్ రోడ్లు, గొడౌన్లు, ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఇలా అనేక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

రూ.25.5 కోట్లతో స్పోర్ట్స్ ఎరీనా

అన్ని రంగాల్లోనూ అంతర్జాతీయ హంగులు సంతరించుకుంటున్న విశాఖ.. క్రీడారంగంలోనూ తిరుగులేని నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఎంవీపీకాలనీ సెక్టార్-8లో ఏఎస్ కాలేజీ గ్రౌండ్‌కు ఆనుకుని ఉన్న వీఎంఆర్‌డీఏకు చెందిన 1.27 ఎకరాల స్థలంలో రూ.25.5 కోట్లతో జీవీఎంసీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను నిర్మించింది. బేస్‌మెంట్‌తో పాటు గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌తో నిర్మించిన ఈ స్టేడియంలో అనేక సౌకర్యాలు కల్పించారు. 2107 చ.మీ విస్తీర్ణంలో బేస్‌మెంట్ ఏరియా, 1449 చ.మీ విస్తీర్ణంలో నిర్మించిన గ్రౌండ్‌ఫ్లోర్‌లో అత్యాధునిక బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులను అభివృద్ధి చేశారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల పరికరాలు ఇక్కడ ఉంచనున్నారు.

స్టేడియంలో సౌకర్యాలు : ఇండోర్ బాస్కెట్ బాల్ కోర్టు-1, ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులు-6, ఇండోర్ వాలీబాల్ కోర్టు-1, స్విమ్మింగ్ పూల్, కిడ్స్ పూల్, అవుట్‌డోర్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, సింథటిక్ అండ్ వుడెన్ ఫ్లోరింగ్, వాల్ క్లాడింగ్, స్పోర్ట్స్ ఫిజియోథెరపీ, యోగా సెంటర్, జిమ్, బోర్డ్ గేమ్స్, చేంజింగ్ రూమ్స్, లాకర్స్, జాగింగ్ ట్రాక్, 294 సీటింగ్ సామర్థ్యం



రూ.7.5 కోట్లతో సీ హారియర్ మ్యూజియం

బీచ్‌రోడ్డులో మరో పర్యాటక కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. ఇప్పటికే సబ్‌మెరైన్, టీయూ-142 యుద్ధ విమానం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా ఏర్పాటు చేసిన సీ హారియర్ మ్యూజియం మరో పర్యాటక మణిహారంగా మారనుంది. రూ.7.5కోట్లతో ఈ మ్యూజియాన్ని వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసింది. 1983లో బ్రిటిష్ ఏరోస్పేస్ నుంచి కొనుగోలు చేసిన ఈ సీ-హారియర్ యుద్ధ విమానం.. నౌకాదళం ఏవియేషన్ విభాగంలో చేరింది. గోవాలోని ఐఎన్ఎస్ హంస యుద్ధ నౌకలో 32 ఏళ్ల పాటు దేశానికి సేవలందించింది. 2016లో సేవల నుంచి నిష్క్రమించింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చొరవతో వీఎంఆర్‌డీఏ ఈ యుద్ధ విమానాన్ని సాగరతీరంలో మ్యూజియంగా తీర్చిదిద్దింది. హైడ్రాలిక్ క్రేన్ సహాయంతో జీ ప్లస్ టూ బిల్డింగ్‌లో సీహారియర్‌ను వేలాడదీశారు. ఇందులో ఏర్పాటు చేసిన సిమ్యులేటర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. అలాగే నావికాదళానికి, ఎయిర్‌క్రాఫ్ట్‌కు సంబంధించి విశేషాలతో కూడిన చిత్రాలను ప్రదర్శించనున్నారు. ఈ మ్యూజియాన్ని సీఎం జగన్ గురువారం సాయంత్రం 5.50 గంటలకు ప్రారంభించనున్నారు. ఇక్కడి నుంచే జీవీఎంసీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను కూడా ప్రారంభిస్తారు.



న్యూస్‌రీల్

నాడు-నేడు పనులు పూర్తిచేయండి: డీఈవో


పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో

మాకవరపాలెం: నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ సూచించారు. మండలంలోని గిడుతూరు ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న తరగతి గదులను బుధవారం పరిశీలించారు. పాఠశాలల ప్రారంభం నాటికి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు చేరిన పాఠ్య పుస్తకాలను కూడా పరిశీలించారు. పుస్తకాలు పూర్తిస్థాయిలో రాగానే ఆయా పాఠశాలలకు పంపిణీ చేయాలని ఎంఈవో నరేష్‌కు సూచించారు.

రెండు వాటర్ ప్లాంట్లు సీజ్


పైడిపాలలో వాటర్ ప్లాంట్ సీజ్ చేసిన అధికారులు

మాకవరపాలెం: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు వాటర్ ప్లాంట్లను జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సీజ్ చేశారు. మండలంలోని శెట్టిపాలెంలో ఉన్న కామధేను వాటర్ ప్లాంట్, పైడపాలలో ఉన్న దుర్గా వాటర్ ప్లాంట్లను ఆయన బుధవారం తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకపోవడంతో పాటు ఐఎస్ఐ మార్క్ లేకపోవడాన్ని గుర్తించారు. ఈ రెండు ప్లాంట్లను రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేశారు. నిబంధనలు పాటించకుండా ఎక్కడ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినా చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఆర్ఐ జెట్టి, వీఆర్వోలు సాంభశివరావు, ప్రసాద్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జిల నియామకం


పీలా వెంకటలక్ష్మి


వెంకట శివసాయి

సీతంపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగ జోనల్ (విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి) ఇన్‌చార్జిలను నియమించారు. యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జిగా ముత్తంశెట్టి వెంకట శివసాయి సందీప్, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జిగా పీలా వెంకటలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ప్రశాంతంగా పాలిసెట్


కశింకోటలోని ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తుమ్మపాల/కశింకోట/అనకాపల్లి రూరల్: జిల్లాలో పాలిసెట్-23 పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి-16 నర్సీపట్టణం-11 రెండు డివిజన్లలో మొత్తం 27 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించామన్నారు. పాలిసెట్-23 పరీక్షకు మొత్తం 9355 మంది దరఖాస్తు చేయగా 8840 మంది హాజరయ్యారన్నారు. హాజరు శాతం 94.5గా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అనకాపల్లిలో పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కశింకోటలోని ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష పర్యవేక్షణ అధికారిగా జి.మురళీకృష్ణ వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శివ, జనరల్ హెడ్ ఎస్.గణేష్, సూపరింటెండెంట్ కె.శివరాం, సిబ్బంది పాల్గొన్నారు. అనకాపల్లి అస్క్ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు ఏఎంఏఎ ఎయిడెడ్ హైస్కూల్, ఏఎంఏఎల్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత మధ్య పరీక్ష నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనకాపల్లి జిల్లా కోఆర్డినేటర్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు, డిప్యూటీ కో ఆర్డినేటర్ వై.శ్రీనివాస్ పరీక్షల జరుగుతున్న తీరును పరిశీలించారు.


పరీక్ష నిర్వహణ తీరు పరిశీలిస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ ఐవీఎస్ఎస్ శ్రీనివాస్

పనిచేయకపోతే సెలవుపై వెళ్లండి


మాట్లాడుతున్న గ్రామ సచివాలయ వార్డు జిల్లా అధికారి మంజులావాణి

- ఆధార్ అప్‌డేట్‌పై ఇంత నిర్లక్ష్యమా..
- సచివాలయ ఉద్యోగుల పనితీరు మారాలి
- గ్రామ, వార్డు సచివాలయ జిల్లా అధికారి మంజులావాణి

నాతవరం : ప్రభుత్వం చెప్పిన పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే సచివాలయ ఉద్యోగులు సెలవు పెట్టి ఇంటికి వెళ్లి పోవాలని గ్రామ, వార్డు సచివాలయ జిల్లా అధికారి మంజులావాణి అన్నారు. ఆమె బుధవారం నాతవరం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, చిన్నారుల ఆధార్ నంబర్లు డేటా నమోదు సచివాలయాల్లో చాలా దారుణంగా ఉందన్నారు. ఈ పని చేయాలని ప్రభుత్వం చెప్పి నెలలు గడుస్తున్నా సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు నిర్లక్ష్యం చేయడం ఏంటని అన్నారు. ప్రభుత్వం అప్పగించిన ఆధార్ డేటా అప్‌లోడ్ చేసే వరకు మండలంలో పని చేసే సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల జీతాలు నిలుపుదల చేయాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావును ఆదేశించారు. ఎం.బి.పట్నం సచివాలయంలో పని చేస్తున్న మహిళా పోలీసు పనితీరు అధ్వానంగా ఉందని సెలవు పెట్టి వెళ్లి పోవాలని సూచించారు.

ఓటీఎస్ డబ్బులు వెంటనే జమ చేయండి...

గుమ్మడిగొండ ఎం.బెన్నవరం, మన్యపురట్ల, చెర్లోపాలెం, గన్నవరం ఎం.బి.పట్నం నాతవరం, పెదగొలుగొండపేట, గునుపూడి, సరుగుడు, చమ్మచింత సచివాలయాల పరిధిలో ఓటీఎస్ డబ్బులు ప్రభుత్వానికి చెల్లించకుండా తమ వద్దే ఉంచుకోవడంపై జిల్లా అధికారి మంజులావాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నాటికి మీ వద్ద ఉన్న డబ్బులు పూర్తిగా ప్రభుత్వ అకౌంటులో జమ చేయకపోతే మిమ్మల్ని సస్పెండ్ చేయడానికి కలెక్టరు దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు.

నాతవరం మండలంలోనే అధికం...

జిల్లావ్యాప్తంగా 24 మండలాల్లో ఓటీఎస్ కోసం వసూలు చేసిన డబ్బులు సచివాలయాల్లో రీ సర్వే సెస్ ద్వారా వచ్చిన డబ్బులు రూ.2 కోట్లకు పైగా కట్టవలసి ఉందని, ఈ డబ్బులు అధికంగా నాతవరం మండలంలోనే కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు జమ చేయాల్సిందని మంజులావాణి తెలిపారు. డబ్బులు పూర్తిగా రికవరీ చేసే బాధ్యత ఎంపీడీవో వహించాలన్నారు. ప్రభుత్వ సొమ్ము ఒక్క పైసా సొంతానికి వాడుకున్నా ఉద్యోగం పోవడం ఖాయమన్నారు. సచివాలయ ఉద్యోగుల పని తీరులో పూర్తిగా మార్పు రావాలన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీరు వ్యవస్థ ఏర్పాటు ఉద్దేశ్యాన్ని అపహాస్యం చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డీఎల్‌డీవో ఉదయశ్రీ, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, పంచాయతీ విస్తరణాధికారి ప్రేమలీల, ఏఎస్‌వో ఉలబాల రాజుబాబు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం

.. లేకుంటే జగనన్నకు చెబుదాం

- వేగవంతమైన, నాణ్యమైన స్పందన కోసమే ఈ కార్యక్రమం
- 1902 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ
- అర్జీదారుల సంతృప్త స్థాయిని పెంచే విధంగా చర్యలు
- జిల్లా స్థాయి పర్యవేక్షణకు జేసీ అధ్యక్షతన కమిటీ
- మండల, డివిజన్ స్థాయిలో నిరంతర సమీక్ష
- విధివిధానాలను ప్రకటించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి


మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి. చిత్రంలో ఎస్పీ మురళీకృష్ణ, డీఆర్వో వెంకటరమణ

సాక్షి, అనకాపల్లి: 'స్పందన'లో అర్జీల ద్వారా పరిష్కారం సాధ్యం కాని సమస్యలను 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా 1902 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసి.. వేగవంతమైన, నాణ్యమైన పరిష్కారాన్ని పొందవచ్చని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు మరింత మెరుగైన, నాణ్యమైన పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతోనే.. రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. అర్జీదారుల్లో సంతృప్త స్థాయిని పెంచే విధంగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ ప్రతీ అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తారన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై.. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, డీఆర్వో వెంకటరమణ, డీఎల్‌డీఓ మంజులవాణితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. పరిష్కారం లభించని అర్జీదారులు '1902' టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చన్నారు. ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్ సందేశంతో.. ఫీడ్‌బ్యాక్, అప్‌డేట్ సమాచారం ఎప్పటికప్పుడు.. హెల్ప్ డెస్క్ కంట్రోల్ రూమ్ నుంచి అందుతుందన్నారు. ఫోన్ కాల్స్ ద్వారా అందిన ఫిర్యాదులపై ముఖ్యమంత్రి స్వీయ పరిశీలనలో.. సీఎంవో స్థాయి నుంచి నేరుగా మానిటరింగ్ జరుగుతుందన్నారు. సచివాలయాల పరిధిలోని ఆయా శాఖల విభాగాల వరకు సీనియర్ అధికారులు ఫిర్యాదును తీసుకువెళ్లి క్షేత్ర స్థాయిలో పరిష్కారాలను కనుగొంటారన్నారు. జేసీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పర్యవేక్షణ జరుగుతుందన్నారు.

'జగనన్నకు చెబుదాం'పై ప్రజలకు అవగాహన

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చటానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మీడియా సహకరించాలని కలెక్టర్ కోరారు.

ప్రతి సమస్య పరిష్కారం కావాలి

ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ.. గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించగలిగితే ఈ కార్యక్రమానికి సార్థకత ఉంటుందన్నారు. ఫ్రీ లిటిగేషన్‌లాంటి సమస్యలపై ఒకే వేదికపై పోలీసు, రెవెన్యూ, పంచాయతీ, ఇతర శాఖల అధికారుల భాగస్వామ్యంతో కసరత్తు చేస్తే వేగంగా...మరింత కచ్చితత్వంతో సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పోలీసు వ్యవస్థకు సంబంధించి సర్కిల్ స్థాయిలో 6 పీఎంయూలు, సబ్ డివిజన్ స్థాయిలో 3 పీఎంయూలు, జిల్లా స్థాయిలో ఒక పీఎంయూను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్వాలిటీ గ్రీవెన్స్ జరిగేలా.. ప్రతి ఫిర్యాదీ ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకుని ఆ సమస్య పరిష్కరిస్తే పూర్తిస్థాయిలో విజయవంతం అవుతుందని పేర్కొన్నారు.

జేసీ నేతృత్వంలో జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ

'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం విజయవంతం కావడానికి జాయింట్ కలెక్టర్ జాహ్నవి నేతృత్వంలో జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యం, హోమ్, వ్యవసాయ శాఖల అధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. వీరు ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి విశ్లేషణ చేస్తారు. పరిష్కారం చూపకుండానే ఫిర్యాదులను అధికారులు మూసివేస్తే.. సంబంధిత ఫైల్‌ను తిరిగి తెరిచే అధికారం 'డిస్ట్రిక్ట్ ఆడిట్ టీమ్'కు ఉంటుంది. డివిజన్ స్థాయిలో అందే ఫిర్యాదులను పరిష్కరించేందుకు.. జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఒక పర్స్యుయేషన్ మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటు చేసి ఒక నోడల్ అధికారిని కేటాయించారు. జిల్లా స్థాయి ఆడిట్ టీమ్‌లాగే.. పీఎంయూ కూడా మండల స్థాయిలో అందే ఫిర్యాదులను డివిజన్ స్థాయిలో.. గ్రామ స్థాయిలో అందే ఫిర్యాదులను మండల స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తుంది. వివిధ శాఖల అధికారుల ప్రమేయంతో సమస్యకు తప్పకుండా పరిష్కారం కనుకొనడమే ఈ కార్యక్రమ లక్ష్యం. అర్జీదారు మొబైల్ ఫోన్‌కు ఎప్పటికప్పుడు పరిస్థితిని ఎస్ఎంఎస్ రూపంలో తెలియజేస్తారు.

మరో 116 సెల్‌ఫోన్లు రికవరీ

- జిల్లా పోలీస్ కార్యాలయంలో మూడో విడత మొబైల్ రికవరీ మేళా
- యజమానులకు అందజేసిన ఎస్పీ మురళీకృష్ణ
- దొంగల భరతం పడుతున్న మొబైల్ ట్రాకర్
- ఇంతవరకు 357 మొబైల్ ఫోన్ల స్వాధీనం

సాక్షి, అనకాపల్లి: కనబడకుండా పోయిన సెల్‌ఫోన్ల ఆచూకీని మొబైల్ ట్రాకర్ ద్వారా కనిపెడుతున్న జిల్లా పోలీస్ యంత్రాంగం మూడో విడతగా 116 ఫోన్లను యజమానులకు అందజేసింది. ఇందులో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి, కృష్ణ, కడప జిల్లాల నుంచి రికవరీ చేసిన మొబైల్ ఫోన్లు ఉన్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఫిర్యాదు వచ్చిన అతి తక్కువ సమయంలోనే అనకాపల్లి జిల్లా పోలీసులు మొబైల్స్ రికవరీ చేస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలో ఇప్పటివరకు రూ.68 లక్షల విలువైన 357 మొబైల్ ఫోన్లు రికవరీ చేశారు. తొలి విడతలో రూ.25 లక్షల విలువైన 131 మొబైల్స్, రెండో విడతలో రూ.22 లక్షల విలువైన 110, మూడో విడతలో రూ.20 లక్షల విలువైన 116 మొబైల్స్ రికవరీ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ కె.వి.మురళీకృష్ణ బాధితులకు ఫోన్లను అందజేశారు. వీరిలో తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలవారు కూడా ఉన్నారు. మొబైల్స్ ఆచూకీ కనిపెట్టిన ఐటీ కోర్ టీంను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, అదనపు ఎస్పీ (క్రైమ్) పి.సత్యనారాయణరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణ్‌మూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, పైడపునాయుడు, ఐటీ కోర్ ఎస్సై రఘువర్మ తదితరులు పాల్గొన్నారు.

'హాయ్' అని మెసేజ్ పెడితే చాలు..

జిల్లా పోలీసులు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మొబైల్ ట్రాకర్ ఆన్‌లైన్ లింక్ అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్ 95052 00100కు 'హాయ్' అని మెసేజ్ చేసిన వెంటనే ఒక లింక్ మొబైల్‌కి వస్తుంది. క్లిక్ చేసి వివరాలను నమోదు చేయాలి. నమోదైన కొన్ని సెకన్లలోనే పోలీస్ ఐటీ కోర్ టీంకి బాధితుడు పోగొట్టుకున్న మొబైల్ వివరాలు అందుతాయి. వెంటనే టీం రంగంలోకి దిగుతుంది. ఈఎంఐ కోడ్, మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా పోయిన మొబైల్ ప్రాంతాన్ని త్వరితగతిని కనిపెట్టి, మొబైల్ ఫోన్‌ను పట్టుకుంటారు.


పోలీసులు పట్టుకున్న సెల్ ఫోన్లను యజమానులకు అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

శతశాతం రికవరీ మా లక్ష్యం

పోలీస్ వాట్సాప్‌కి ఫిర్యాదు అందిన అన్ని కేసుల్లో ఫోన్లను రికవరీ చేయాలనే లక్ష్యంతో మా కోర్ టీం పనిచేస్తుంది. మొబైల్ మిస్సింగ్ గురించి ప్రజలు పోలీసు స్టేషన్లకు వెళ్లేందుకు విముఖత చూపడంతో జిల్లాలో సులభతరమైన పద్ధతిని ప్రవేశపెట్టారు. త్వరితగతిన రికవరీ అవుతున్నందున ప్రజలు మొబైల్ మిస్సింగ్‌పై ఫిర్యాదులు చేయడానికి ముందుకువస్తున్నారు. సెల్‌ఫోన్లు రికవరీ చేసి ఇవ్వడం ఆనందంగా ఉంది.

– కె.వి.మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ

క్లుప్తంగా

చోడవరంలో మెగా జాబ్ మేళా రేపు

అనకాపల్లి టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 12న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14 కంపెనీల్లో వివిధ ఉద్యోగాల భర్తీకి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న 18 నుంచి 35 ఏళ్ల లోపు నిరుద్యోగులు పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9014765287, 9494791935 సంప్రదించాలన్నారు.

రైల్వే డీఎస్పీగా మోహనరావు బాధ్యతల స్వీకరణ



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్(డీఎస్ఆర్‌పీ)గా బి.మోహనరావు బుధవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకు విజయనగరం జిల్లా బొబ్బిలి సబ్ డివిజనల్ పోలీస్‌ఆఫీసర్(ఎస్‌డీపీవో)గా విధులు నిర్వర్తించారు. సుమారు 20 నెలల పాటు రాజమండ్రి డీఎస్ఆర్‌పీ బి.వి.ఎస్. నాగేశ్వరరావు విశాఖపట్నం ఇన్‌చార్జి డీఎస్ఆర్‌పీగా వ్యవహరించారు. ప్రయాణికుల భద్రత, రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఈ సందర్భంగా మోహనరావు తెలిపారు. వీఐపీల భద్రత, దొంగతనాల నివారణ, నేరాలు, అవాంఛనీయ సంఘటనలు నివారిస్తూ, పెట్రోలింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా గంజాయి రవాణాపై కఠిన నిఘా ఉంచాలని, ఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు, ఇంటిలిజెన్స్, ఎస్ఈబీలతో సమన్వయంతో పని చేయాలన్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీస్ సీఐ పి.కోటేశ్వరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హెచ్‌సీఎల్ టెక్‌బీ జాబ్ డ్రైవ్ రేపు

మురళీనగర్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ ఈ నెల 12న టెక్‌బీ జాబ్ డ్రైవ్ నిర్వహిస్తుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రవేశాలకు ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. 2022 లేదా 2023 సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి కనీసం 60% మార్కులతో ఉత్తీర్ణులైన యువతీయువకులు ఈ జాబ్ డ్రైవ్‌కి అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 12న ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 98484 38254ను సంప్రదించాలని సూచించారు.

ఉత్తీర్ణతే లక్ష్యంగా...

- ఇంటర్ ఫెయిలైన విద్యార్థినులకు కేజీబీవీల్లో ప్రత్యేక తరగతులు
- కె.కోటపాడు, మునగపాక, నర్సీపట్నం, వి.మాడుగులలో నిర్వహణ



కేజీబీవీలో సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులు



కేజీబీవీలో ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

కె.కోటపాడు: ఒకసారి ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులు మరలా ఉత్తీర్ణత సాధించాలంటే ఏం చేయాలో పాలుపోదు. పాస్ కాలేదని బాధతోపాటు సప్లిమెంటరీ పరీక్షలకు ప్రైవేటు ట్యూషన్ పెట్టించుకునే స్థోమత లేక నిరుత్సాహంతో చదువు ఆపేస్తుంటారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఇటువంటి వారి ఉత్తీర్ణత సాధనకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్‌లో ఈ ఏడాది ఉత్తీర్ణత సాధించని వారికి ప్రత్యేకంగా ఉపాధ్యాయినులతో రోజూ సబ్జెక్టులవారీగా బోధిస్తున్నారు. కె.కోటపాడు మండలం గొల్లలపాలెం కేజీబీవీలో గొల్లలపాలెం, రోలుగుంట, గొలుగొండ, రాంబిల్లి, చోడవరం కేజీబీవీల్లో ఉత్తీర్ణత సాధించని 73 మంది విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో వి.మాడుగుల కేజీబీవీలో 105 మంది, నర్సీపట్నం కేజీబీవీలో 112 మంది, మునగపాక కేజీబీవీలో 118 మంది విద్యార్థినుల ఉత్తీర్ణత సాధన లక్ష్యంగా కృషి చేస్తున్నారు.

తరగతుల నిర్వహణ ఇలా :

- కేజీబీవీల్లో ప్రత్యేక తరగతులను ఉదయం నుంచి రాత్రి వరకూ నిర్వహిస్తున్నారు.
- ఉదయం 5.30 నిమిషాలకు విద్యార్థినులు పరీక్షల్లో మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు యోగా శిక్షణ ఇప్పిస్తున్నారు.
- ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్టడీ అవర్ నిర్వహిస్తున్నారు.
- 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఏయే సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులు కాలేదో వాటిపై బోధన
- ప్రతీ రాత్రి రెండు సబ్జెక్టులపై మోడల్ పరీక్షల నిర్వహణ
- విద్యార్థునులకు చదువులతోపాటు పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నారు.
- సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతి విద్యార్థినీ ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయినులు కృషి చేస్తున్నారు.

20 వరకూ తరగతులు..



సప్లిమెంటరీ పరీక్షలను రాసే కేజీబీవీ విద్యార్థినులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. చదువులో పాటు మంచి పౌష్టికాహారం అందిస్తున్నాం. పరీక్షలంటే ఒత్తిడి, భయం పోయేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న ప్రతి విద్యార్థినిపైనా పర్యవేక్షణ ఉంచుతూ బోధిస్తున్నాం. ఈ నెల 20వ తేదీ వరకూ ఈ తరగతులు నిర్వహించనున్నాం.

– బి.చిన్నమ్మలు, ప్రిన్సిపాల్, కేజీబీవీ, గొల్లలపాలెం

ఆటోను ఢీ కొట్టిన ఐషర్ వ్యాన్



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం



ఆస్పత్రిలో క్షతగాత్రులు

- 12 మందికి గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం
- ఆటో రాంగ్ రూట్లో వెళ్లడంతోనే ప్రమాదం!



పరిస్థితి విషమంగా ఉన్న చిన్నారి సుధీర్ లాజర్, అతని తండ్రి కిరణ్

నక్కపల్లి : జాతీయరహదారిపై నక్కపల్లి సారిపల్లి పాలెం మధ్యలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో నలుగురు పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులందరికీ నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి అనకాపల్లి, విశాఖ ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. వివరాలివి. పెదతీనార్ల, చినతీనార్ల గ్రామాలకు చెందిన 8 మంది హైదరాబాద్ నుంచి జన్మభూమి ట్రైన్‌లో తుని రైల్వే స్టేషన్‌లో దిగారు. వారు తుని నుంచి ఆటోలో స్వగ్రామాలకు వెళ్తుండగా, తహసీల్దార్ కార్యాలయం దాటిన తర్వాత రాంగ్ రూట్లో సారిపల్లిపాలెం మీదుగా తీనార్ల వెళ్తున్న ఆటోను విశాఖ నుంచి తుని వైపు వెళ్తున్న ఐషర్‌వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ఆటో వెనుక వస్తున్న బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. నక్కపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు కిరణ్ తన కుటుంబ సభ్యులతో కలసి మోటారు సైకిల్‌పై చినతీనార్ల వెళ్తున్నారు. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న కిరణ్ కుటుంబీకులతో పాటు, ఆటోలోని ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు సమీపంలో ఉన్న నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి, విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వారిలో పెదతీనార్ల, చినతీనార్ల గ్రామాలకు చెందిన మైలపల్లి కావ్య, గరికిన రాజమ్మ, మైలపల్లి అమ్మోరు, మైలపల్లి రమణ, బొంది చిట్టిబాబు, ఎస్.పెంటయ్యమ్మలతో పాటు, ఆర్‌ఎంపీ వైద్యుడు పి.కిరణ్, భారతి, వారి పిల్లలు సుధీర్ లాజర్, శృతి ఉన్నారు. తీవ్రంగా గాయపడిన ఐదేళ్ల చిన్నారితో పాటు మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వైద్య సిబ్బంది తెలిపారు. ఆటోడ్రైవర్ పెంకె ఆప్పారావుకు కూడా తీవ్ర రక్తస్రావం అయింది.

వీరందరిని హుటాహుటీన అనకాపల్లి, విశాఖపట్నం తరలించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. ఆటో రాంగ్‌రూట్లో వెళ్లడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. జాతీయ రహదారి మీదుగా సారిపల్లిపాలెం పెట్రోలు బంక్ నుంచి యూటర్న్ తీసుకోవాల్సిన ఆటో దగ్గరగా ఉంటుందని, తహసీల్దార్ కార్యాలయం నుంచి రాంగ్‌రూట్లో ప్రయాణించడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

జాబితాలో పేరే లేదు.. జీతాలిచ్చేస్తున్నారు!

- అక్రమాలకు కేంద్ర బిందువుగా వైద్య ఆరోగ్యశాఖ
- తాజాగా వెలుగులోకి ఉద్యోగుల అక్రమ నియామకం
- గత డీఎంహెచ్‌వోపై స్పందనలో ఫిర్యాదు



మహారాణిపేట(విశాఖ): వైద్య ఆరోగ్య శాఖ.. అక్రమాలకు కేంద్ర బిందువుగా మారింది. నిన్నటి మొన్నటి వరకు నకిలీ సర్టిఫికెట్లు, ఆర్డర్లతో వార్తల్లో నిలిచిన వైద్య ఆరోగ్య శాఖలో తాజాగా అక్రమ ఉద్యోగుల నియామక వ్యవహారం వెలుగుచూసింది. అభ్యర్థుల ఎంపిక కోసం వైద్య ఆరోగ్య శాఖ విడుదల చేసిన ఏ జాబితాలో పేరు లేకపోయినా.. ఏడుగురు దర్జాగా ఉద్యోగాలు చేస్తున్నారు. వీరికి నెలసరి జీతాలు క్రమం తప్పకుండా అందుతున్నాయి. గత జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బదిలీ సమయంలో ఈ నియామకాలు జరిగినట్టు ఆ శాఖలో చర్చ జరుగుతోంది. అక్రమంగా ఏడుగురు పోస్టులు పొందారని కొంత మంది స్పందనలో ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వైద్య ఆరోగ్యశాఖకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బోధనాస్పత్రుల్లో ఎప్పటికప్పుడు పోస్టులు భర్తీ చేస్తోంది. ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కోసం ఆస్పత్రుల్లో 14 మందిని నియమించింది. ఇలా అన్ని విభాగాల్లో పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతోంది. అయితే దీనిని కొంత మంది వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అధికారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పోస్టుల భర్తీలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఒక్కొక్క పోస్టుకు ఒక్కో రేటు నిర్ణయించి ఉద్యోగాలిచ్చేస్తున్నారు.

బదిలీ ఉత్తర్వులు జారీ అయిన వెంటనే..

గత జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి హయాంలో వైద్య ఆరోగ్యశాఖలో పలు పోస్టులు భర్తీ చేశారు. కార్యాలయం సిబ్బంది, అధికారుల మీద నమ్మకం లేక ఆ డీఎంహెచ్‌వో ఓ మెడికల్ ఆఫీసర్‌ను నియమించుకుని పోస్టులు భర్తీ చేయించినట్లు అప్పట్లో విమర్శలు వచ్చాయి. అయినా ఎవరి మాట వినకుండా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగించారు. ఇంతలో డీఎంహెచ్‌వో బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. వెంటనే తెర వెనుక అక్రమ పోస్టులను భర్తీ చేశారు. ఏ జాబితాలో పేరు లేకపోయినా ఏడుగురికి పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. నగరం, అనకాపల్లిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఒక ఫార్మాసిస్ట్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, ఒక జూనియర్ అకౌంట్ ఆఫీసర్, ఓ డాటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)ను భర్తీ చేసినట్లు సమాచారం. ఈ ఏడు పోస్టులు ఎంపిక జాబితాలో లేవని, కానీ జీతాలు ఇచ్చే జాబితాల్లో కనిపిస్తున్నాయని కొంత మంది స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి వారు జీతాలు తీసుకుంటున్నట్లు అందులో పేర్కొన్నారు.

విచారణ చేపడతాం



ఈ వ్యవహారం నా దృష్టికి రాలేదు. ఈ ఏడు పోస్టుల గురించి విచారణ చేపడతాం. ఎక్కడా అక్రమాలు జరిగేందుకు అవకాశం లేదు. ఒక వేళ జరిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం. భర్తీ ప్రక్రియను మరింత పకడ్బందీగా చేపడతాం.

– డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎంహెచ్‌వో, విశాఖపట్నం

ప్రతీ పది నిమిషాలకు ఓ ట్విస్ట్

- అరవింద్ స్వామి లేనిదే 'కస్టడీ'లేదు
- హీరో నాగచైతన్య



మాట్లాడుతున్న హీరో నాగచైతన్య

బీచ్‌రోడ్డు(విశాఖ): తాను నటించిన కస్టడీ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని హీరో నాగ చైతన్య అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీనియర్ నటుడు అరవింద స్వామి లేనిదే కస్టడీ సినిమా లేదన్నారు. ఆయన పోషించిన పాత్ర ఆధారంగానే సినిమాకు కస్టడీ అనే టైటిల్ పెట్టామన్నారు. ఆయన ఈ సినిమాలో నటించేందుకు అంగీకరించారనే విషయం తెలిగానే.. మా బృందానికి నమ్మకం పెరిగిందన్నారు. ఈ సినిమాకి సంబంధించి ముందు ఓ పాయింట్ చెప్పిన దర్శకుడు వెంకట్ ప్రభు కొన్ని నెలల తర్వాత పూర్తి స్టోరీ చెప్పారన్నారు. కథ, స్క్రీన్‌ప్లే నచ్చడంతో సినిమా ప్రారంభమైందన్నారు. సినిమా బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ చాలా బాగుంటుందని, శరత్ కుమార్, ప్రియమణి వంటి సీనియర్ నటులు ఇందులో నటించారన్నారు. సినిమాలో ప్రతీ పది నిమిషాలకు ఓ ట్విస్ట్ ఉంటుందన్నారు. సినిమా మొదలైన 40 నిమిషాల తర్వాత నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుందని చెప్పారు. ఈ చిత్రం ఈ నెల 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతుందని, అందరూ థియేటర్‌లో ఈ సినిమా చూడాలని కోరారు. ఏ కథనైనా బలంగా నమ్మి తెరకెక్కిస్తే అది ఆటోమేటిక్‌గా పాన్ ఇండియా సినిమా అవుతుందన్నారు. హీరోగా అన్ని జోనర్ సినిమాలు చేయాలని ఉందని, మంచి కథ కుదిరితే అఖిల్‌తో తప్పకుండా నటిస్తానన్నారు. వైజాగ్ అంటే తనకు చాలా ఇష్టమని.. ఇక్కడ చిత్రీకరించిన ప్రతీ సినిమా హిట్ అవుతుందన్న నమ్మకం ఉందన్నారు. తాను నటించిన ప్రేమమ్, మజిలీ సినిమాల షూటింగ్ అధిక భాగం ఇక్కడే జరిగిందని గుర్తు చేశారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో సైకో వీరంగం



వైద్యాలయంలో సైకోను బంధించిన ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది

- భయభ్రాంతులకు గురైన రోగులు



అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు సైకోను తరలిస్తున్న పోలీసులు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో బుధవారం తెల్లవారు జామున సైకో వీరంగం సృష్టించాడు. వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి సుమారు ఒంటిగంట సమయంలో అనకాపల్లి రైల్వే స్టేషన్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తికి కాళ్లకు దెబ్బలు తగిలినట్టు చెప్పి వైద్యాలయానికి తీసుకుని వచ్చి జాయిన్ చేసి వెళ్లిపోయాడు. విధులు నిర్వహిస్తున్న వైద్యులు అతనికి చికిత్స అందిస్తున్న సమయంలో తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో ఆ వ్యక్తి ఆస్పత్రిలో రెండో అంతస్తు ఎక్కి వీరంగం సృష్టించాడు. వెంటనే ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది అతన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించగా వారిపై రాళ్లతో దాడి చేసి వార్డుల్లోకి వెళ్లి రోగులను భయాందోళనకు గురిచేశాడు. దీంతో వైద్యులు పట్టణ పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ సత్యనారాయణ తన సిబ్బందితో వైద్యాలయానికి వచ్చి సెక్యూరిటీ సిబ్బందితో కలిసి సైకోను అదుపులోకి తీసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం అతనిని అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే ఆ వ్యక్తి వైద్యాలయంలో రెండు కిటికీల గ్లాసులను పగలగొట్టాడు.

ఈత సరదాకు చిన్నారి బలి



పవన్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మునగపాక/అనకాపల్లి టౌన్: వేసవి సెలవుల్లో సరదాగా పిల్లలను స్విమ్మింగ్ పూల్‌కు తీసుకెళ్లిన తల్లిదండ్రులు క్షణాల్లో కుమారుడిని కోల్పోయారు. భగవంతుడా.. ఏమిటీ ఘోరమని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మునగపాక మండలం అరబుపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు బుధవారం ఈతకు దిగి, నీట మునిగారు. అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనలో అన్న రాపేటి పవన్ (8) తిరిగిరాని లోకాలకు చేరుకోగా తమ్ముడు చరణ్ ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డాడు. ఆటో డ్రైవర్ రాపేటి గంగునాయుడు (చంటి) దంపతులు వేసవి సెలవులు కావడంతో పిల్లలను తీసుకొని అనకాపల్లి బైపాస్ దరి స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లారు. తన పిల్లలకు ఈత నేర్పించేందుకు తండ్రి పూల్‌లోకి దిగారు. సరదాగా ఆడుకుంటున్న పిల్లలు అంతలోనే నీట మునిగి ప్రమాదానికి లోనయ్యారు. సంఘటన జరిగిన సమయంలో ఒడ్డున ఉన్న తల్లి మాధవి ఏం చేయలేని నిస్సహాయ స్థితిని ఎదుర్కొంది. కళ్లెదుటే చనిపోయిన కుమారుడిని చూసి బోరున విలపించడంతో స్థానికులు కూడా కంటతడి పెట్టారు. ఫిర్యాదు చేయకుండా పవన్ మృతదేహాన్ని ఇంటికి తీసుకురావడంతో.. పట్టణ ఎస్ఐలు దివాకర్, సత్యనారాయణ, ఎస్.ప్రసాద్ అరబుపాలెం గ్రామానికి చేరుకొని పవన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఈ ఘటనతో అరబుపాలెంలో విషాదం నెలకొంది.

సీపెట్‌లో ప్రవేశాల దరఖాస్తుకు 28 గడువు

ఎంవీపీ కాలనీ(విశాఖ తూర్పు): సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్)లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం ఈ నెల 28వ తేదీతో గడువు ముగియనుందని సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.శేఖర్ తెలిపారు. లాసన్స్‌బే కాలనీలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడ వేదికగా సీపెట్ సేవలు అందిస్తుందన్నారు. ఇందులో భాగంగా మూడేళ్ల వ్యవధిలో డిప్లమో ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమో ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ) కోర్సులను సంస్థ అందిస్తున్నట్టు తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులన్నారు. బీఎస్సీ ఉత్తీర్ణత లేదా ఆఖరి సంవత్సరం జరుగుతున్న విద్యార్థులు రెండేళ్ల వ్యవధితో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సుకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు cipet. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బోధన పద్ధతుల్లో మార్పు రావాలి

- డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: బోధన పద్ధతుల్లో మార్పు రావాలని డీఈవో ఎల్. చంద్రకళ అన్నారు. నగరంలోని వైఎంసీఏ హాల్లో మూడు రోజులుగా ఇంగ్లిష్ సబ్జెక్టుపై జరిగిన రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా బోధనలోను మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల అభిరుచి మేరకు పాఠ్యాంశాల బోధన సాగాలన్నారు. ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే శిక్షణను విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. ఏపీసీ శ్రీనివాసరావు, ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్, డైట్ కాలేజీ అధ్యాపకులు గొట్టేట రవి పాల్గొన్నారు.

బంగారం కోసం మహిళ దారుణ హత్య

- స్నేహంగా మెలిగి ఆటో డ్రైవర్ ఘాతుకం
- మిస్సింగ్ కేసులో కాల్‌డేటా ఆధారంగా దర్యాప్తు



నిందితుడు మైలిపల్లి రాజు



రీసు గోపి (ఫైల్)



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ కె.లక్ష్మణమూర్తి

కొమ్మాది(భీమిలి): బంగారం కోసం ఓ మహిళను ఆటో డ్రైవర్ దారుణ హత్య చేసిన సంఘటన భీమిలిలో సంచలనం రేపింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తగరపువలస బాలాజీనగర్‌కు చెందిన రీసు గోపి(30) అనే యువతికి పదేళ్ల కిందట విజయనగరానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. కుటుంబ కలహాల కారణంగా ఆమె భర్తతో విడిపోయింది. అప్పటి నుంచి గోపి తన అక్క రీసు రాము వద్ద ఉంటోంది. ఇదిలా ఉండగా మూడేళ్ల క్రితం జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ పరిధి పాతూరుకు చెందిన ఆటో డ్రైవర్ మైలిపల్లి రాజుతో గోపికి పరిచయం ఏర్పడింది. ఇది స్నేహంగా మారి అప్పుడప్పుడు కలుసుకుంటుండేవారు. ఈ క్రమంలో ఈ నెల 1న తన మేనమామ కమార్తె పెళ్లి చూపులుకు అలంకరణ కోసం బంగారు వస్తువులు(10 తులాలు) తీసుకుని చిప్పాడకు వెళ్లాలని రాజుకు ఫోన్ చేసి తగరపువలస రావాలని గోపి చెప్పింది. అదే రోజు సాయంత్రం పెళ్లి చూపులు ముగించుకుని తిరిగి తన ఇంటి వద్ద విడిచిపెట్టాలని కోరింది. అయితే అలా బయటకు వెళ్దామని రాజు కోరగా.. ఆమె సరే అంది. దీంతో ఇద్దరూ కాపులుప్పాడ గంభీరం గెడ్డ వద్దకు చేరుకున్నారు. తనకు అప్పులు ఉన్నాయని, అవి తీర్చేందుకు బంగారం కావాలని గోపిని రాజు అడిగాడు. ఇందుకు ఆమె అంగీకరించకపోవడంతో ఆటోలో ఉన్న తాడును గోపి మెడకు చుట్టి హత్య చేసి అదే గెడ్డలో పడేసి, 10 తులాల బంగారాన్ని తీసుకుని పారిపోయాడు.

మిస్సింగ్ కేసుతో దర్యాప్తు

ఈ నెల 1న చిప్పాడ వెళ్లిన తన చెల్లి తిరికి రాకపోవడంతో ఆమె అక్క రీసు రాము 2వ తేదీన భీమిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ కోసం గాలించిన పోలీసులకు ఎటువంటి సమాచారం లేకపోవడంతో కాల్‌డేటా ఆధారంగా ఈ కేసును ఛేదించారు. గోపి చివరిగా ఫోన్‌లో మాట్లాడింది రాజుతోనే అని తెలుసుకున్న పోలీసులు నిఘా పెంచారు. ఈ క్రమంలో రాజు మొబైల్ సిగ్నల్ ఆధారంగా బీచ్ రోడ్డు మంగమారిపేటలో ఉన్నట్టు గుర్తించారు. పోలీసులు, గోపి బంధువులు మంగళవారం రాత్రి రాజును పట్టుకునేందుకు మంగమారిపేట చేరుకున్నారు. ఇది తెలుసుకున్న రాజు అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినప్పటికీ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన రీతిలో విచారించగా.. తనకు అప్పులు ఉన్నాయని, బంగారం కావాలని గోపిని అడిగానని, ఆమె నిరాకరించడంతో కోపంతో హత్య చేసి గెడ్డలో పడేసినట్టు నేరాన్ని ఒప్పుకున్నాడు. గెడ్డలో పడి ఉన్న గోపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని గోపి కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా పాలిసెట్



డైట్ కళాశాలలో పాలిసెట్‌కు హాజరవుతున్న విద్యార్థులు

తుమ్మపాల : స్థానిక డైట్ కళాశాలలో బుధవారం నిర్వహించిన పాలిసెట్–23 ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులు ఉదయం 9.30 గంటలకే కళాశాలకు చేరుకున్నారు. పోలీసులు విద్యార్థుల్ని తనిఖీలు చేసి, పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం మజ్జిగ పంపిణీ చేశారు.

కర్ణాట బీజేపీ నేతపై కాంగ్రెస్ నేతల ఫిర్యాదు



ఎస్ఐ దివాకర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

అనకాపల్లిటౌన్ : అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుటుంబ సభ్యుల హత్యాయత్నానికి కుట్రలు పన్నిన కర్ణాటక బీజేపీ నేత మణికంఠ రాథోడ్‌పై చర్యలు తీసుకోవాలంటూ స్థానిక ఎస్ఐ దివాకర్‌కు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయిన భానుమూర్తియాదవ్ కోరారు. ఈ మేరకు ఎస్ఐకి బుధవారం ఫిర్యాదు చేశారు. ఖర్గే వ్యూహాలతో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందనే అక్కసుతోనే ఖర్గే కుటుంబ సభ్యుల్ని లక్ష్యం చేసుకున్నారని ఫిర్యాదులో ఆరోపించారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో మజ్జిగను అందిస్తున్న సర్పంచ్ కోన నాయుడు

కశింకోట : మండలంలోని బుచ్చియ్యపేట గ్రామంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ కోన నాయుడు బుధవారం ప్రారంభించారు. వేసవి దాహార్తిని తీర్చేందుకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ముగిసే వరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తామని ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 346 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	-----	-----
మొదటి రకం	4,000	5,220
రెండో రకం	3,870	4,000
మూడో రకం	3,510	3,840

అనకాపల్లి సినిమాలు

అరంగేట్రం	రాజా
రామబాణం	సత్యనారాయణ స్క్రీన్-1
గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ (తెలుగు 3డి)	సత్యనారాయణ స్క్రీన్-2
పీఎస్-2	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
రుద్రుడు	వెంకటేశ్వర
ఉగ్రం	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–7 యూనిట్లు, బీ పాజిటివ్–8 యూనిట్లు, ఓ పాజిటివ్–22 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 359 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ఉత్తమ చదువు.. అత్యుత్తమ వసతులు



కశింకోట బాలికల జెడ్పీ హైస్కూల్లో నిర్మాణంలో ఉన్న తరగతి గదులు



బాలికల ప్రాథమిక పాఠశాలకు నిర్మిస్తున్న ప్రవేశ ద్వారం

- శరవేగంగా నాడు–నేడు రెండో విడత పనులు
- మండలంలో 13 స్కూళ్లకు రూ.4.14 కోట్లు

ప్రభుత్వ స్కూళ్లు.. ఒకప్పటిలా దుంపల బడులు కావు. చాలా ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో లేని వసతుల్ని నేడు అందిపుచ్చుకున్నాయి. అదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్ప బలమేనంటే అతిశయోక్తి కాదు. మన బడి నాడు–నేడు తొలి విడతలో చాలా ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. ఇపుడు రెండో విడతలో మండలంలోని 13 స్కూళ్లలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

కశింకోట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో రెండో విడత నాడు–నేడు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 13 స్కూళ్లలో వివిధ అభివృద్ధి పనులకు రూ.4.14 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో సదరు స్కూళ్లను అందంగా, మరిన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

- కశింకోట బాలికల హైస్కూల్లో మొదటి విడత నాడు–నేడులో రూ.61 లక్షలతో పనులు నిర్వహించారు. ఇప్పుడు రెండో విడతలో అసంపూర్తిగా ఉన్న మూడు తరగతి గదులు పూర్తి చేయడానికి రూ.36 లక్షలు మంజూరయ్యాయి. దీంతో పనులు చేపట్టారు.
- కశింకోట బాలికల ప్రాథమిక పాఠశాలకు రూ.18 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఐదు తరగతి గదుల మరమ్మతులు, గ్రానైట్ ఫ్లోరింగ్, వంట గది నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ముఖద్వారం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రహరీ ఎత్తు చేయడంతోపాటు, తరగతి గదుల ముందు భాగాన్ని మొక్కల పెంపకానికి అనువుగా తీర్చిదిద్దే పనులు చేపట్టాల్సి ఉంది.



కశింకోటలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న రెండో విడత నాడు–నేడు పనులు

- నరసింగబిల్లి హైస్కూల్లో రూ.కోటీ 8 లక్షలతో ఆరు తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభించారు.
- ఏఎస్ పేటలో రూ.కోటీ 20 లక్షలతో ఆరు తరగతి గదులు నిర్మిస్తున్నారు.
- వెదురుపర్తి హైస్కూల్లో రూ.42 లక్షలతో మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టారు.
- కస్తూర్బాగాంధీ పాఠశాలలో రూ.48 లక్షలతో తరగతి గదులు నిర్మిస్తున్నారు.

అచ్యుతాపురం, రామన్నపాలెం, విసన్నపేట, మోసయ్యపేట, బంగారయ్యపేటలో ఒక్కో ప్రాథమిక పాఠశాల, బయ్యవరంలో రెండు ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కొక్క దానికి రూ.12 లక్షలు చొప్పున మొత్తం రూ.84 లక్షల నాడు–నేడు నిధులతో పనులు నిర్వహిస్తున్నారు. వీటితో వంట గదులు, టాయిలెట్ల నిర్మాణం, మరమ్మతులు, భవనాల మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నారు.

త్వరితగతిన బిల్లుల చెల్లింపు

ఇప్పటికే పనులు నిర్వహించిన మేరకు రూ.కోటీ 96 లక్షల చెల్లింపులు చేశారు. పనుల ప్రగతి మేరకు బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి ఆటంకాల్లేకుండా ప్రభుత్వం చూస్తోంది. దీంతో కాంట్రాక్టర్లు ఉత్సాహంగా నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. పనులు పూర్తయితే పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడి సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకోగలవని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

శరవేగంగా పనులు

మండలంలో నాడు–నేడు పథకంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అభివృద్ధి, మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సెంట్రలైజ్డ్ టెండర్ల ద్వారా నాణ్యమైన సామగ్రినే వినియోగిస్తున్నాం. నిర్మాణ నాణ్యతలో రాజీ పడకుండా ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూసుకుంటున్నాం. పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– బమ్మిడి సాయికృష్ణ, మండల ఇంజినీర్, కశింకోట

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి



ఎన్టీఆర్ కాలనీలో పర్యటిస్తున్న మంత్రి గుడివాడ



లబ్ధిదారునికి సంక్షేమ బ్రోచర్ అందిస్తున్న మంత్రి

- రెండు రోజుల్లో ఎన్టీఆర్ కాలనీలో తాగునీటి బోర్ల ఏర్పాటు
- 'గడప గడపకు మన ప్రభుత్వం' లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : గత ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై పెద్దగా దృష్టిసారించకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పెరిగిపోయాయని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ పరిధి ఎన్టీఆర్ కాలనీ, నాయీబ్రాహ్మణకాలనీ, పలకావారివీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్టీఆర్ కాలనీలో రెండు రోజుల్లో బోర్లు ఏర్పాటు చేసి, ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు తాగునీరు, రహదారి సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. వివిధ ప్రభుత్వశాఖల అధికారులు గ్రామాల్లో తిరుగుతూ అక్కడి ప్రజలకు కావలసిన కనీస మౌలిక సదుపాయాలపై దృష్టిసారించాలని సూచించారు. రహదారుల నిర్మాణానికి అంచనావేసి, ప్రభుత్వ అనుమతులతో త్వరితగతిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలనిక కోరారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను సకాలంలో అందించి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, ఆయన ఆదేశాల మేరకు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు తామంతా క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. మూలపేట ప్రాథమిక పాఠశాలకు నాడు–నేడు రెండో విడతలో రూ.16 లక్షల నిధులు కేటాయించినట్టు వెల్లడించారు. ప్రస్తుతం రూ.5 లక్షలతో పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, గ్రామ సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ మజ్జి అలివేణి, జెడ్పీ వైస్ చైర్పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, వార్డు మెంబర్ పెంటకోట సతీష్, పార్టీ నేతలు పలకా సత్తిబాబు, చెవ్వాకుల ఈశ్వరరావు, దాడి రామకృష్ణ, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతక స్వామికి పుష్పాంజలి



శివాలయంలో నిర్వహిస్తున్న పుష్పాంజలిలో భక్తులు



స్వామివారికి సమర్పించిన స్వీట్లు, పండ్లు

కశింకోట : స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో బుధవారం రాత్రి పుష్పాంజలి కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వార్లకు ఇటీవల వైశాఖ పౌర్ణమి రోజు వార్షిక కల్యాణోత్సవాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. కల్యాణ వేడుకల అనంతర కార్యక్రమాల్లో భాగంగా భక్తులు తెచ్చిన పలు రకాల స్వీట్లు, పిండి వంటలు, పండ్లు నివేదించి పుష్పాంజలి జరిపారు. ఈ సందర్భంగా భక్తులు భక్తి పాటలు ఆలపించి పూజలు చేశారు. ఆలయంలో సర్వమంగళాంబ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి 108 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 108 దంపతులకు తాంబూల ప్రసాదాలను పంపిణీ చేశారు. పుష్పాంజలికి హాజరైన భక్తులతో ఆలయం కళకళలాడింది. పూజల అనంతరం ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు వి.శంకరం, వి.చిదంబరం, వి.కృష్ణలు పర్యవేక్షించారు.

‘ఉక్క’రి బిక్కిరి

కశింకోట : మండల ప్రజలు బుధవారం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మూడు రోజులుగా ఎండ తీవ్రత పెరగడంతోపాటు ఉక్కపోత తోడవ్వడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అత్యవసర పనులుంటే తప్ప బయటకు వెళ్లకుండా ఇంటికే పరిమితమయ్యారు. గురువారం ఎండ తీవ్రతతోపాటు వడగాల్పులు వీచే అవకాశం ఉందని, ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల సంస్థ సెల్ సందేశాల ద్వారా ప్రజలను హెచ్చరించడంతో మరింతగా ఆందోళన చెందుతున్నారు.

ఐసీడీఎస్ భవన స్థల పరిశీలన



ఐసీడీఎస్ భవన నిర్మాణానికి స్థల పరిశీలనలో ఎంపీడీవో కొంకి అప్పారావు

కశింకోట: స్థానిక ఐసీడీఎస్ కేంద్రానికి సొంత భవన నిర్మాణ కోసం బుధవారం ఎంపీడీవో కొంకి అప్పారావు కశింకోటలోస్థల పరిశీలన చేశారు. గతంలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణ వివరాలను తెలుసుకున్నారు. ప్రస్తుత డిజైన్ ప్రకారం అంచనాలు రూపొందించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు.

సకల సౌకర్యాలతో జగనన్న ఇళ్లు



ఇళ్ల నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : జగనన్న లే అవుట్ల ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీకులు దాడి రత్నాకర్ అన్నారు. మండలంలోని కోడూరు గ్రామంలో 1, 2 లేఅవుట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులోని మండలంలోని బీఆర్టీ కాలనీ, రామభద్రాపురంకాలనీల మాదిరిగానే ఇక్కడ కూడా ఇళ్ల నిర్మాణాలు పూర్తయితే మంచి కాలనీగా రూపుదిద్దుకునే అవకాశముందన్నారు. ఈ లేఅవుట్లలో సకల సౌకర్యాలు ఏర్పాటు చేయడంతోపాటు, లబ్ధిదారులకు అనువుగా ఇళ్లను తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి అప్పు లేకుండా సొంతింటి కల నెరవేర్చే దిశగా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో 80, 81వ వార్డుల కార్పొరేటర్లు కొణతాల నీలిమ, పీలా లక్ష్మీసౌజన్య, వార్డు ఇన్‌చార్జిలు కొణతాల భాస్కరరావు, పీలా రాంబాబు, పార్టీశ్రేణులు పీలా శ్యామ్, దాడి ఈశ్వరరావు, కర్రి అప్పాజీ, మద్దాల భీమేష్, విల్లూరి చంద్రశేఖర్, కోటిపల్లి శ్రీను, కొణతాల పరదేశినాయుడు, ఆడారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల సదనానికి వసతులు



కశింకోట బాల సదనంలో పనులను పరిశీలిస్తున్న విద్యాశాఖ ఈఈ సీహెచ్ మృత్యుంజయరావు

సాక్షి ఎఫెక్ట్..

కశింకోట : స్థానిక బాల సదనంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు ప్రారంభించారు. బాల సదనంలో సమస్యలపై ×బాల సదనం..సమస్యల నిలయం×శీర్షికతో ఈ నెల 1న సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. సదనంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష శ్రీచరణ్ ఆదేశాల మేరకు పనులు చేపట్టి నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఇటీవల సదనాన్ని పరిశీలించి మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న పనులను విద్యాశాఖ ఈఈ సీహెచ్ మృత్యుంజయరావు బుధవారం పరిశీలించారు. పలు సూచనలు చేశారు. బాల సదనం ప్రహరీ ఎత్తు పెంచడం, పిల్లలు ఆడుకోవడానికి మైదానాన్ని బాగు చేయడం, గదుల్లో సెల్ఫ్‌లు, తల్లిదండ్రులు కూర్చునేందుకు సిమెంట్ దిమ్మలు, దెబ్బతిన్న రక్షణ గోడ పునరుద్ధరణ తదితర పనులను చేపట్టనున్నట్లు ఈఈ తెలిపారు. ఈ పరిశీలనలో మండల ఇంజినీర్ బమ్మిడి సాయికృష్ణ, బాల సదనం సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామయ్య సేవలు ప్రశంసనీయం



సీతారామయ్యను సత్కరిస్తున్న గౌరీపతి, సంఘ సభ్యులు

అనకాపల్లిటౌన్ : స్థానిక బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య సంక్షేమ సంఘం కోశాధికారి గరుడా సీతారామయ్య సేవలు ప్రశంసనీయమని విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి కేవీ గౌరీపతి అన్నారు. సంఘ కార్యాలయంలో బుధవారం సీతారామయ్య అభినందన సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకతీతంగా శ్మశానంలో అపర ఖర్మలు చేసేందుకు భవనాన్ని సీతారామయ్య అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. అంతిమయాత్ర వాహనాలు, ఫ్రీజర్ బాక్సులు ఏర్పాటు చేసి, తుది మజిలీ ప్రశాంతంగా నిర్వహించడానికి కారుకులయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బిళ్లపాటి చిదంబరం, గుంపెన రమేష్‌గుప్త, పసుమర్తి రాము, కేఎల్ఎస్ కుమార్, పెన్మత్స కృష్ణంరాజు పాల్గొన్నారు.

‘ఉపాధి కూలీలకు అన్యాయం’

అచ్యుతాపురం(అనకాపల్లి): గ్రామీణఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పెంచి, కూలీలకు సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము కోరారు. బుధవారం ఆయన అచ్యుతాపురం మండలంలోని ఖాజీపాలెంలో గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో సమావేశమై మాట్లాడారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ కూలీల విషయంలో అనేక మార్పులు తీసుకువస్తుందని, ఇది కూలీల పట్ల శరాఘాతంగా మారిందన్నారు. పాత పద్ధతిలో కూలీలకు న్యాయం చేసి, కూలి ధర పెరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవిందు, సుశీల,గంగరాజు, అప్పలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ధర్మ ప్రచారం



గ్రామాల్లో హిందూ ధర్మ ప్రచారం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు



ఉప్పవరంలో ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : మండలంలో గల పెదరాంభద్రపురం గ్రామంలో బుధవారం ధర్మ ప్రచారం నిర్వహించారు. హిందూ ధర్మ రక్షణకు సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి తిరిగి హిందూ ధర్మంపై ప్రచారం నిర్వహించడం జరుగుతుందని ఫౌండేషన్ మండల కన్వీనర్ తాడి సూరిమూర్తి తెలిపారు. చిన నర్సాపురం గ్రామంలో కూడా సీతారామ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో 50 గడపలకు వెళ్లి సనాతన ధర్మంపై అవగాహన కల్పించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ కన్వీనర్ మేడిశెట్టి దివాణం, సబ్ డివిజన్ కన్వీనర్ నీలాపు వెంకటరెడ్డి, డివిజన్ ధర్మ ప్రచారక్ కట్టా వీరబాబు పాల్గొన్నారు.

ఉప్పవరంలో ఇంటింటికీ ధర్మ ప్రచారం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని ఉప్పవరంలో బుధవారం ఇంటింటికీ ధర్మ ప్రచారం నిర్వహించారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు మాట్లాడుతూ కుటుంబ సమేతంగా దేవాలయాలను సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ చిన్నినాయుడు, గంగిరెడ్డి రోహిత్, ఎస్.భాను, సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

‘ఉపాధి హామీ బడ్జెట్ పెంచాలి’



ఎంపీడీవో హేమసుందర్రావుకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధి కూలీలు

పరవాడ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ గడచిన తొమ్మిదేళ్లలో బీజేపీ ప్రభుత్వం రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ నుంచి, ఈ ఏడాది రూ.60 వేల కోట్లకు బడ్జెట్ కేటాయింపులు తగ్గించిందని ఆక్షేపించారు. దీంతో ఉపాధి కూలీలకు శ్రమకు తగ్గ కూలీ అందడం లేదన్నారు. పని దినాలు కూడ తగ్గుతున్నాయని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలో అనేక నిబంధనలు పెట్టి కూలీలను, పనులకు దూరం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో పనిముట్లకు అదనంగా డబ్బులు చెల్లించేవారని, ఇపుడు దాంతోపాటు, వేసవి అలవెన్స్‌ను కూడా తొలగించడం దారుణమన్నారు. ఉపాధి కూలీలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి, కొలతలతో సంబంధం లేకుండా కనీస కూలీని రూ.600కు, ఏడాదికి 200 రోజుల పనిదినాలు తగ్గకుండా చూడాలని డిమాండ్ చేశారు. వేసవి ఎండల దృష్ట్యా సమ్మర్ అలవెన్స్, మెడికల్ కిట్లు, తాగునీరు, టెంట్లు తదితర సదుపాయాలను కల్పించాలని ఎంపీడీవో వి.హేమసుందర్రావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సీహెచ్ వెంకటలక్ష్మి, పి.భవాని, రెడ్డి ముత్యాలమ్మ, ఆర్.కొండమ్మ, పి.పార్వతి, జయభారతి, నాగమణి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాటి ముంజెలకు గిరాకీ

మునగపాక : వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు తాటి ముంజెలను ఆశ్రయిస్తున్నారు. గ్రామాల్లో దొరికే తాటికాయలతో పాటు ముంజెలను కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇదే అదనుగా అమ్మకందారులు తాటికాయను రూ.10కు విక్రయిస్తున్నారు. డజను ముంజెలను రూ.40 నుంచి రూ.50కు విక్రయిస్తున్నారు. మునగపాక ఎస్‌బీఐ దరి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

16న మండల సర్వసభ్య సమావేశం

సబ్బవరం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 16న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

చదరంగంతో మేధాశక్తి పెంపు

సబ్బవరం : చదరంగం పోటీలతో విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందని సబ్బవరం శాఖా గ్రంథాలయ అధికారి వి.శిరీష తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం చదరంగం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదరంగంతో సునిశిత బుద్ధి సాధ్యమవుతుందన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేలా ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు



ఎంఈవో కార్యాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో కొంకి అప్పారావు

కశింకోట : మండలంలోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు బుధవారం చేరాయి. వీటిని స్థానిక మండల విద్యా శాఖ కార్యాలయం వద్ద భద్రపరిచారు. ఎంపీడీవో కొంకి అప్పారావు పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. వీటినంత త్వరగా పుస్తకాలను సంబంధిత స్కూళ్లకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఎంఈవో చిట్టిబాబును ఆదేశించారు.

రాజేష్‌కు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పరామర్శ

సబ్బవరం : ఇటీవల గాయపడిన మండలంలోని నారపాడు శివారు అమ్ములపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ యువ నాయకుడు గొర్లి రాజేష్‌ను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం పరామర్శించారు. రాజేష్ ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయన ఆరోగ్య స్థితిని ఆరా తీశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొటాన రాము, పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, సీనియర్ నాయకులు సబ్బవరపు ముత్యాలనాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, మామిడి కొండాజీ, గొర్లి నూకరాజు, మండల లక్ష్మణ, సబ్బవరపు నాగభూషణం, కొటాన రమణ, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, కోట్ని నాయుడు, జట్టి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరంలో నీతి కథలు

పరవాడ: వాడచీపురుపల్లి శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపును పురస్కరించుకుని బుధవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ విజ్ఞాన శిబిరంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు కామేశ్వరి, ఇందిర విద్యార్థులకు నీతి కథలు, తెలుగు పద్యాలను బోధించారు. గ్రంథాలయాన్ని వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులను ఎడ్యుకేషన్ వెల్ఫేర్ కార్యదర్శి వి.అప్పలరాజు సూచించారు.